## క్లుప్తంగా

### గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా



**ఉదయగిరి(వింజమూరు):** వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ డీఈ పీరాన్, మరో ఇద్దరు అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన అధికారులు డుమ్మా కొట్టారు. గత కొన్ని వారాలుగా ఇదే తంతు కావడంతో ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కోసం రావడమే మానేశారు.

### మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని తీర్మానం



**వింజమూరు(ఉదయగిరి):** వింజమూరు పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని వార్డు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. వింజమూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సృజన అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసే విషయమై చర్చించారు. వింజమూరును మున్సిపాలిటీగా చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నందున అప్‌గ్రేడ్ చేయాలని వార్డుసభ్యులు ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. ఈ విషయమై త్వరలో గ్రామసభను ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయాలను సేకరించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తెలిపారు.

### ఆశావర్కర్ల సంఘం నుంచి పల్లపు అరుణ తొలగింపు

**వింజమూరు(ఉదయగిరి):** వింజమూరు మండల ఆశావర్కర్ల సంఘం నుంచి పల్లపు అరుణను తొలగిస్తున్నట్లు మండల సీఐటీయూ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి తెలిపారు. వింజమూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పల్లపు అరుణ సంఘ బైలాను ఉల్లంఘించిన నేపథ్యంలో క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట సీఐటీయూ గౌరవాధ్యక్షుడు కామాక్షయ్య ఉన్నారు.

### వ్యాసరచన పోటీలు



**మర్రిపాడు:** మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాలలోని విద్యార్థినులకు ఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు పోటీలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మహిళా దినోత్సవం విశిష్టతను విద్యార్థినులకు వివరించారు.

### అంగన్‌వాడీలకు రవాణా భత్యం పంపిణీ



**ఉదయగిరి:** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరురోజుల పాటు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలకు రవాణా భత్యాన్ని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు స్థానిక స్త్రీశక్తి భవనంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఒక్కొక్కరికి రోజుకు రూ.50 వంతున ఆరు రోజులకు రూ.300 చెల్లించినట్లు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.

### అంతర్ రాష్ట్ర పోటీల్లో కొత్తసత్రం విద్యార్థినుల సత్తా



**కావలి :** మండలంలోని కొత్తసత్రం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు శాలిని, సరిత, శ్రీలేఖ అంతర్ రాష్ట్ర క్రీడా పోటీల్లో సత్తా చాటారు. తెలంగాణ రాష్ట్రం నల్గొండలో ఈ నెల 1, 2 తేదీల్లో నిర్వహించిన సబ్ జూనియర్ బాలికల టార్గెట్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు, శ్రీనివాసరావు, పీడీ మురళి, ఉపాధ్యాయ బందం, గ్రామస్తులు సోమవారం అభినందించారు.

# ఫ్లోరైడ్ నీరే దిక్కు



నిరుపయోగంగా మారిన ట్యాంకు

- మూలకు చేరిన రాజీవ్ సబ్‌మిషన్ ప్రాజెక్టు
- అధికారుల పర్యవేక్షణ లోపంతో 66 గ్రామాలకు నిలిచిన రక్షిత నీటి సరఫరా
- ఫ్లోరోసిస్ బారిన పడుతున్న ప్రజలు

**వరికుంటపాడు:** ఉదయగిరి నియోజకవర్గంలోని ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు సురక్షిత నీటిని అందించే లక్ష్యంతో నిర్మించిన రాజీవ్ సబ్‌మిషన్ ప్రాజెక్టు మూలకు చేరింది. అధికారుల పర్యవేక్షణా లోపం ..కాంట్రాక్టర్ బాధ్యతా రాహిత్యంతో కాలక్రమేణా ప్రాజెక్ట్ నిరుపయోగంగా మారి రక్షిత మంచినీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో 66 గ్రామాల ప్రజలు ఫ్లోరైడ్ నీటిని తాగుతూ వ్యాధులు బారిన పడుతున్నారు.

**పథకం లక్ష్యం**

1997లో ప్రభుత్వం ఉదయగిరి నియోజకవర్గంలోని ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, కొండాపురం, మర్రిపాడు మండలాల్లోని 66 ఫ్లోరైడ్ పీడిత ఆవాస ప్రాంత ప్రజలకు సమగ్ర రక్షత మంచినీటిని సరఫరా చేసే లక్ష్యంతో సుమారు రూ.7.55కోట్ల అంచనా వ్యయంతో రాజీవ్ సబ్‌మిషన్ పథకాన్ని మంజూరు చేసింది. అందులో భాగంగా గండిపాళెంలోని పాన్నెబోయిన చెంచురామయ్య జలాశయం వద్ద నీటిని శుద్ధి ప్లాంట్‌ను నిర్మించింది. అనంతరం పైపు లైన్‌ల ద్వారా గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసే పనులు ప్రారంభించింది. 2002 నాటికి పనులు పూర్తికాగా అప్పటి కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు, సహాయ మంత్రి సుభాష్ మహేరియా మంచినీటి సరఫరాను ప్రారంభించారు.


**అధికారుల నిర్లక్ష్యంతో...**

రాజీవ్ సబ్‌మిషన్ పథకం ప్రారంభంలో 66 గ్రామాలకు తాగు నీటిని అందించేది. సుమారు పదిహేను ఏళ్ల తరువాత 44 గ్రామాలకు పరిమితమైంది. కాలక్రమేణా అధికారుల పర్యవేక్షణా లోపం, నిర్వహణ నిధుల కొరత, తదితర కారణాలతో నీటి సరఫరా చివరకు 11 గ్రామాలకే పరిమితమైంది. అనంతరం నిర్వహణ లోపం కారణంగా పథకం పూర్తిగా మరుగునపడిపోయింది. దీంతో ఫ్లోరైడ్‌పీడిత గ్రామాల ప్రజలు రక్షిత మంచి నీటి కోసం పరితపిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లోని మినీమంచినీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల ప్రజలు ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడుతున్నారు. గండిపాళెం జలాశయం వద్ద ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్‌కు సంబంధించిన మైక్రోఫిల్టర్, నీటిని శుద్ధిచేసే శాండ్ ఫిల్టర్లు, పంప్‌హౌస్‌లోని మోటార్లు, ఇతర యంత్రపరికరాలు తుప్పుపట్టి నిరుపయోగంగా మారా యి. గ్రామాల్లో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతోనే పథకం లక్ష్యం నీరుగారిపోయి లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తాగునీటి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంచినీటి పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.


| ప్రాజెక్ట్ పరిధి |
| --- |
| నీటిని సరఫరా చేసే మండలాలు – 8 |
| ఆవాస ప్రాంతాలు – 66 |
| జనాభా – 44,403 |
| సమగ్ర మంచినీటి పథకాలు – 8 |
| రక్షిత మంచినీటి పథకాలు – 7 |



టీసీపల్లెలో దిష్టి బొమ్మలా దర్శనమిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకు



నీటి శుద్ధి తొట్లలో పెరిగిన కంపచెట్లు



తుప్పు పట్టిన మైక్రోఫిల్టర్



తుప్పు పట్టిన ఇనుప పైపులు

### అనారోగ్యం బారిన పడుతున్నారు



గతంలో గండిపాళెం జలాశయం వద్ద ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు సురక్షిత నీటిని అందించేందుకు రాజీవ్ సబ్ మిషన్ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. గత కొన్నేళ్లుగా ప్రాజెక్ట్ నిరుపయోగంగా మారడంతో మినీ మంచినీటి పథకాల ద్వారా సరఫరా చేసే ఫ్లోరైడ్ కలిసిన నీటిని తాగి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రాజెక్ట్‌ను ఉపయోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.

–దాసరి యర్రాఓబయ్య, టీసీపల్లి, వరికుంటపాడు మండలం

### ఫ్లోరోసిస్‌తో ఇబ్బందులు పడుతున్నాం



మా పంచాయతీలో ఫ్లోరైడ్ సమస్య ఉంది. గతంలో గండిపాళెం సబ్‌మిషన్ ప్రాజెక్ట్ ద్వారా సురక్షిత నీటిని సరఫరా చేసేవారు. గత కొన్నేళ్లుగా అది నిరుపయోగంగా మారడంతో ప్రజలు ఫ్లోరైడ్ నీటిని తాగి ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడుతున్నారు. గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నా సరిగా శుద్ధి చేయకపోవడం, రుచి కోసం రసాయనాలు అధిక మోతాదులో కలుపుతుండడంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. అధికారులు స్పందించి రాజీవ్ సబ్‌మిషన్ ప్రాజెక్టును ఉపయోగంలోకి తీసుకురావాలి.

–మద్దిశెట్టి వెంకటేశ్వర్లు, తిరుమలాపురం, ఉదయగిరి మండలం

### ఉపయోగంలోకి తీసుకొస్తాం



గత కొన్నేళ్లుగా గండిపాళెం జలాశయం వద్ద ఉన్న రాజీవ్ టెక్నాలజీ సబ్‌మిషన్ ప్రాజెక్ట్ నిరుపయోగంగా ఉంది.ఈ పథకాన్ని జలజీవన్‌మిషన్ పథకానికి అనుసంధానం చేసి సోమశిల జలాలను సరఫరా చేసి ఉపయోగంలోకి తీసుకొస్తాం.

– రామకృష్ణారావు, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉదయగిరి

## బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ పద్మజాకుమారి

**కలిగిరి:** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ పద్మజాకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా కలిగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాల నిర్మూలనపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాలికలు 18 ఏళ్లు, బాలురు 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహాలు చేసుకోవాలని సూచించారు. అనంతరం బాల్యవివాహాలతో తలెత్తే అనర్థాలను వివరించారు. అనంతరం బాలికలతో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించి సంతకాల సేకరణ చేపట్టారు. హెచ్‌ఎం భీమేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, హైమావతి, సీహెచ్‌ఓ సాయిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు షర్మిల, శాంతికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్, ఎంపీపీ

**చేజర్ల:** మండల కేంద్రమైన రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ బీ మురళి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వం పుట్టికి రూ.19,720 మద్దతు ధరను అందజేస్తోందన్నారు. దళారులకు తక్కువ ధరకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధరను పొందాలని సూచించారు. ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మనరసారెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు ఉడతా హజరత్తయ్య, ఏఓ వీ శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి



ప్రాజెక్ట్‌ను తిలకిస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

**అల్లూరు:** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓలు రవీంద్రనాథ్, సునీత, తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక విక్రమ్ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై సైన్స్ నమూనాలను తిలకించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకుని భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. పశుసంవర్ధక శాఖ వైద్యులు మహేశ్వరయ్య, గౌతమ్, విశాంత్రి ఉపాధ్యాయులు కొప్పు శ్రీనివాసులు, కరస్పాండెట్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

### క్షయపై అప్రమత్తంగా ఉండాలి



**దుత్తలూరు:** క్షయ వ్యాధి పై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య సిబ్బంది సూచించారు. మండలంలోని నర్రవాడ, కొత్తపేట పంచాయతీలు టీబీ ముక్త్ పంచాయతీలుగా ఎంపికయ్యాయి. ఈ నేపథ్యంలో నర్రవాడ, కొత్తపేట పంచాయతీలను క్షయ నియంత్రణ బృందం సోమవారం సందర్శించింది. క్షయ రోగుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. క్షయ వ్యాధిపై భయం అవసరం లేదని, సకాలంలో మందులు, పౌష్టికాహారం తీసుకుంటే నియంత్రణలోకి వస్తుందని తెలిపారు. ఎవరైనా రెండు వారాలకు మించి దగ్గుతో బాధపడుతుంటే వెంటనే గళ్ల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నర్రవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి హరీష్, ఎస్‌టీఎస్ షబ్బీర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### చెత్తను తొలగించండి మహాప్రభో



**చేజర్ల:** మండల కేంద్రమైన చేజర్లలో పారిశుధ్యం పడకేసింది. దర్గా ప్రాంతంలో రెండు నెలల నుంచి చెత్తను తొలగించకపోవడంతో పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ కారణంగా దర్గాకు రంజాన్ మాస ప్రార్థనల కోసం వస్తున్న భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను తొలగించాలని పంచాయతీ పాలకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలాధికారులు స్పందించి చెత్తను వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

### భవన నిర్మాణ కూలీల రేట్లు పెంపు

**ఉదయగిరి:** భవన నిర్మాణ కూలీల రేట్లను పెంచినట్లు టీఎస్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బొజ్జా శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యావసర వస్తువులు, ఇతర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బేల్దారి మేస్త్రికి రోజుకు రూ.850, మహిళా కూలీకి రూ.550, మగ కూలీకి రూ.600గా నిర్ణయించామని చెప్పారు. భవన నిర్మాణదారులు సహకరించాలని కోరారు.

### నగదు చెక్ అందజేత

**ఉదయగిరి:** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్‌కు సంబంధించి రూ.లక్ష నగదు చెక్‌ను హెచ్‌ఎం బాలకేశవులకు ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు సోమవారం అందజేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కుర్రపల్లి మెయిన్ పాఠశాలలో మిగిలిన నిధులను అందజేసినట్లు తెలిపారు.

### 35 మందికి వైద్యపరీక్షలు

**వరికుంటపాడు:** మండలంలోని గణేశ్వరాపురంలో వైద్యాధికారిణి కరీష్మా ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. 35 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

### కోడిపందేల స్థావరంపై దాడులు

**చేజర్ల:** కాలేయపాళెంలో ఆదివారం సాయంత్రం కోడిపందేలు ఆడుతున్న ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు చేజర్ల ఎస్సై తిరుమలరావు సోమవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6వేల నగదు, ఒక కోడిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మేకలు మేపుకొనే తండ్రీకొడుకులు ఆవుల తిరుపతయ్య, వెంకట కృష్ణయ్యను కూడా కోడిపందేలు ఆడుతున్నారనే అనుమానంతో విచారణ నిమిత్తం చేజర్ల పోలీస్‌స్టేషన్‌కు పిలిపించామని చెప్పారు. వారు తమపై పోలీసులు దాడి చేసినట్లుగా అసత్యప్రచారాలు చేస్తున్నారని, అది వాస్తవం కాదని ఎస్సై పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**సంగం:** మండలంలోని దువ్వూరు వద్ద నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. నెల్లూరు కిసాన్ నగర్‌కు చెందిన వ్యక్తి గాంధీజనసంఘం వద్దనున్న ర్యాంపునకు మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో దువ్వూరు వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న బైక్‌ను ఢీకొని కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడ్ని స్థానికులు 108 వాహనంలో నెల్లూరులోని వైద్యశాలకు తరలించారు. సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విధిగా హెల్మెట్ ధరించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

**ఉదయగిరి:** ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి సూచించారు. సోమవారం ఆయన ఉదయగిరిలో వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేని, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులను గుర్తించి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్లు, ఇతర వాహనాలు నడిపే వారు సీటుబెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. ఈ నెల 1 నుంచి మోటార్ వాహనాల చట్ట ప్రకారం జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు హెల్మెట్, సీటుబెల్టులు పెట్టుకోకపోయిన, పొల్యూషన్, బీమా సర్టిఫికెట్లు, వాహన, డ్రైవింగ్ లైసెన్సులు లేకపోయిన భారీగా జరిమానా వేస్తామని హెచ్చరించారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన పెండింగ్ చలానాలను వెంటనే చెల్లించాలన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

## బాధితులకు న్యాయం చేయాలి



బాధితులను పరామర్శిస్తున్న కమిటీ సభ్యులు

**ఆత్మకూరు:** కోడిపందేల స్థావరం వద్ద లేకున్నా తండ్రీకొడుకులను ఎస్సై స్టేషన్‌కు పిలిపించి కొట్టడం దారుణమని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు ఖండించారు. ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చేజర్ల మండలానికి చెందిన తండ్రీకొడుకులు ఆవుల తిరుపతయ్య, ఆవుల వెంకట కృష్ణయ్యను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. మేకలు మేపుకొని జీవనం సాగించే తండ్రీకొడుకులను ఆదివారం సాయంత్రం చేజర్ల ఎస్సై స్టేషన్‌కు రమ్మంటున్నారని ఇద్దరు కానిస్టేబుళ్లు తీసుకెళ్లారని చెప్పారు. పొలాల్లో కోడిపందేల నిర్వహణలో మీ ప్రమేయం ఉందంటూ వెంకట కృష్ణయ్యను ఎస్సై తీవ్రంగా కొట్టారని, తండ్రి అడ్డుకోబోగా అతన్ని కొట్టారని ఆరోపించారు. కొద్దిసేపటి తరువాత స్టేషన్ నుంచి పంపించగా పోలీసు దెబ్బలకు తట్టుకోలేక ఇరువురు ఆత్మకూరు ఆస్పత్రిలో చేరారని తెలిపారు. కోడిపందేలు, పేకాట ఆడుతూ పట్టుబడ్డ వారిపై కేసులు నమోదు చేయడం సహజమేనని, అయితే ఘటనా స్థలంలో లేని తండ్రీకొడుకులను ఎస్సై స్టేషన్‌కు పిలిపించి దారుణంగా కొట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సభ్యులు ప్రకాశం జిల్లా మెంబర్ పోట్లూరి లక్ష్మయ్య, గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ బీఎల్ శేఖర్, సంఘాల సభ్యులు కత్తి బాలకొండయ్య, గంధళ్ల బాబు, ఎంఎల్ బాలు, పెంచలయ్య, తదితరులు ఉన్నారు.

## గ్రీవెన్స్ అర్జీలకు సత్వరమే పరిష్కారం



సంగంలో అర్జీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ షాలెట్



ఉదయగిరిలో అర్జీ స్వీకరిస్తున్న ఎంపీడీఓ

**ఉదయగిరి:** ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందజేసే అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపుతున్నట్లు తహసీల్దార్ సుభద్ర తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ అప్పాజీ పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. గ్రీవెన్స్‌కు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు. ఇకపై హాజరుకాకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**గ్రీవెన్స్‌కు నాలుగు అర్జీలు**

**అనుమసముద్రంపేట:** మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికకు నాలుగు అర్జీలు అందినట్లు తహసీల్దారు శ్రీరామకృష్ణ తెలిపారు. అందులో మూడింటిని అప్పటికప్పుడే పరిష్కరించామని చెప్పారు. ఒక అర్జీ పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారితో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సోమశిల:** అనంతసాగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు అందాయి. తహసీల్దార్ వై సుభాషిణి అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

సంగం: మండల తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలను నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సోమ్లానాయక్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ షాలెట్ వినతిపత్రాలను స్వీకరించారు. నిర్ణీత సమయంలోగా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు తెలిపారు.